సాక్షి
నారాయణపేట
ఆదివారం । 6 । జూలై । 2025



జలాశయాలకు జలకళ
కృష్ణా, తుంగభద్ర నదుల్లో వరద పెరగడంతో జలకళ సంతరించుకున్నాయి.
వివరాలు 8లో ▸



వికసిత భారత్
వికసిత భారత్ కోసం కృషిచేస్తున్నామని నీతి ఆయోగ్ ఉప కార్యదర్శి అన్నారు.
వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.9 /21.9

వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

సార్వత్రిక చదువు.. భవితకు ఆదెరువు



జిల్లాలో అధ్యయన కేంద్రాలు	గతేడాది ఎస్ఎస్సీలో చేరిన వారు
17	600
ఇంటర్‌లో చేరిన వారు	**ఈ సారి టార్గెట్**
990	2,700

- ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 11వ తేదీ వరకు అవకాశం
- విద్యకు దూరమైన వారికి ప్రయోజనం

నారాయణపేట రూరల్: వివిధ కారణాలతో చదువుకు దూరమైన వారికి తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం (టాస్) వరంగా మారింది. 2008లో ఎస్ఎస్సీ, 2009 నుంచి ఇంటర్‌లో అడ్మిషన్లు స్వీకరిస్తుండటంతో ఎంతో మంది ఉన్నత విద్య అవకాశాలు అందిపుచ్చుకోవడంతో పాటు ఉపాధి మార్గాలు పొందుతున్నారు. అంతే కాకుండా ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తూ.. పదోన్నతులకు మార్గం సుగుమం చేసుకుంటున్నారు. వయసుతో సంబంధం లేకుండా చదువుకునేందుకు టాస్ మంచి వేదికగా మారింది.

ఉన్నత విద్యకు తోడ్పాటు..

విద్యార్హతలు లేక పలువురు ఉద్యోగ అవకాశాలు కోల్పోతుండటంతో పాటు ఉద్యోగాలు సాధించిన వారు పదోన్నతికి దూరమవుతున్నారు. టాస్ ద్వారా ఎస్ఎస్సీ, ఇంటర్ పూర్తిచేసిన వారు ఆ తర్వాత డిగ్రీ, పీజీ సైతం చేసేందుకు ఆస్కారం ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలతో పాటు పదోన్నతులకు సైతం తోడ్పాటు అందిస్తోంది. ఇందులో చదువుకునే అభ్యాసకులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడంతో పాటు ప్రతి ఆది, రెండవ శనివారం, ఇతర ప్రభుత్వ సెలవు దినాల్లో 30 రోజులకు మించకుండా తరగతులు ఉంటాయి. రెగ్యులర్ విద్యతో సమానమైన బోధన లభిస్తుంది. జిల్లాలో వందలాది మంది రెగ్యులర్ విద్య కంటే సార్వత్రిక విద్యకే ప్రాధాన్యత ఇస్తున్నారు.



జిల్లా కేంద్రంలోని ఓపెన్ స్కూల్‌లో చదువుకుంటున్న అభ్యర్థులు (ఫైల్)

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ..

ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఎస్ఎస్సీ, ఇంటర్ ప్రవేశాల కోసం గత నెల 12న నోటిఫికేషన్ విడుదలైంది. మీసేవ కేంద్రాల్లో రూ. 150 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇక ఎస్ఎస్సీకి రూ. 1,400, ఇంటర్‌కు రూ. 1,500 ఫీజు చెల్లించాలి. ఎస్సీ ఎస్టీలతో పాటు మహిళలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, ఎక్స్ సర్వీస్‌మాన్‌లకు ఫీజులో రూ. 300 రాయితీ ఉంటుంది. ఈ నెల 11వ తేదీ వరకు దరఖాస్తు గడువు విధించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న పత్రాలను వారు ఎంపిక చేసుకున్న కేంద్రాల్లో సమర్పించి న తర్వాత సీటు కేటాయిస్తారు.

ఈ సారి ఉల్లాస్‌తో కలిసి..

నవభారత అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఉల్లాస్‌ను ఈ ఏడాది నుంచి టాస్‌కు వర్తింపజేశారు. మహిళా సంఘాల సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఎస్ఎస్సీ పూర్తి చేయించేందుకు సెర్ప్, సమగ్ర శిక్ష, వయోజన విద్యాశాఖ భాగస్వామ్యం కానున్నాయి. జిల్లాలో నిరక్షరాస్యులను ఉల్లాస్ సర్వేతో పాటు చదువు మధ్యలో మానేసిన వారి వివరాలను సైతం గ్రామీణ అభివృద్ధిశాఖ నమోదు చేసింది. చదువు అర్థాంతరంగా మానేసిన గ్రామస్థాయి సిబ్బంది కచ్చితంగా ప్రవేశం పొందాలని నిబంధన విధించారు. కనీస విద్యార్హతతో సంబంధం లేకుండా 14ఏళ్లు నిండిన వారు ప్రవేశం పొందడానికి అర్హులుగా నిర్ధారించారు. దాదాపు 30 వరకు సబ్జెక్టులను ఏర్పాటు చేయగా.. వాటిలో ఏవేని ఐదు అంశాలను ఐచ్ఛికంగా తీసుకునే వెసులుబాటు కల్పించారు. ఒకసారి ప్రవేశం పొందితే.. ఐదేళ్ల వరకు పరీక్షలు రాసుకునే అవకాశం ఉంటుంది. ఏటా రెండు సార్లు పరీక్షలు నిర్వహించనున్నారు.

సమన్వయంతో ముందుకు..



చదువు మధ్యలో మానేసిన ప్రతి ఒక్కరినీ సార్వత్రిక పాఠశాలలో చేర్పించాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. అందరి సహకారంతో నిరక్షరాస్యులైన వయోజనులతో ఎస్ఎస్సీ పరీక్షలు రాయించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే చదువు మధ్యలో మానేసిన వారి సర్వే సైతం జరిగింది. ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటి వద్దే ఉండి సెలవులో చదువుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పదోన్నతులు పొందేందుకు అవకాశం లభిస్తుంది.

– శ్రీనివాస్, టాస్ జిల్లా కోఆర్డినేటర్

జిల్లాలో కేంద్రాలు ఇలా..

జిల్లావ్యాప్తంగా ఓపెన్ టెన్త్, ఇంటర్ చదువుకునేందుకు 17 అధ్యయన కేంద్రాలను ఏర్పాటు చేశారు. దామరగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నారాయణపేట మాడ్రన్ స్కూల్‌లో కేవలం టెన్త్, నారాయణపేట డీవీఎం, సాయి జూనియర్ కళాశాల, మరికల్ విద్యా జూనియర్ కళాశాలల్లో ఇంటర్ కేంద్రాలు ఉన్నాయి. మక్తల్ జెడ్పీహెచ్ఎస్, రాఘవేంద్ర కాలేజీ, ప్రభుత్వ పాఠశాల, నర్వ జెడ్పీహెచ్ఎస్, మరికల్ వెంకటసాయి స్కూల్, ధన్వాడ జెడ్పీహెచ్ఎస్, గోటూర్ జెడ్పీహెచ్ఎస్, మద్దూరు బాయ్స్, వివేకానంద కాలేజీ, హకీంపేట జెడ్పీహెచ్ఎస్, కోస్గి అంబేడ్కర్ కాలేజీ, గుండుమాల్ వికాస్ స్కూల్‌లో ఎస్ఎస్సీ, ఇంటర్ అధ్యయన కేంద్రాలు కొనసాగుతున్నాయి.

న్యూస్‌రీల్

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి



ధన్వాడ: విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ట్రెయినీ కలెక్టర్ ప్రణయ్ సూచించారు. శనివారం ధన్వాడ మండలం కొండాపూర్‌లోని తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాలలో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు కొంతసేపు గణితం బోధించారు. అనంతరం డిజిటల్ తరగతుల నిర్వహణను పరిశీలించారు. ట్రెయినీ కలెక్టర్ వెంట ప్రిన్సిపాల్ రాజారాం, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ సాంబయ్య నాయక్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



మరికల్: ప్రజా సమస్యలపై కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి బాల్‌నర్సింహ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా రెండో మహాసభలను శనివారం మరికల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో బాల్‌నర్సింహ మాట్లాడుతూ.. సీపీఐ పార్టీ ప్రజల పక్షాన నిలబడి అనేక పోరాటాలు సాగిస్తుందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో ప్రజాస్వామ్యానికి స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. మేధావులు, కవుల గొంతు నొక్కడమే ప్రధాన ఎజెండాగా పనిచేస్తోందన్నారు. మూడు సార్లు అధికారంలోకి వచ్చిన బీజేపీ.. దేశంలో ఒక కొత్త పరిశ్రమను కూడా ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభు త్వం ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో రాజకీయ ప్రమేయం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు విజయరాములు, నర్సింహులు, సంతోష్, రాము, శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

ఓట్ల కోసమే బీసీ వాదమా?

మహబూబ్‌నగర్ రూరల్: జనాభాలో మెజారిటీగా ఉన్న బీసీలకు పాలనలో భాగస్వామ్యం కల్పించారా.. ఓట్ల కోసమే బీసీ వాదమా అని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ ప్రశ్నించారు. బీసీలను రాజకీయ బానిసల్లా చూస్తున్న అగ్రకుల రాజకీయ పార్టీల నాయకులు బీసీ వ్యతిరేక పార్టీల జెండాలను వదిలివేయాలని పిలుపునిచ్చారు. స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అధికారమే లక్ష్యంగా ఎన్నికల సమయంలో అన్ని రాజకీయ పార్టీల బీసీల ఓట్ల కోసం బీసీ జపం చేయడం తప్ప ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా నేటికీ బీసీలకు ఒరుగబెట్టిందేమి లేదన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, జనాభా దామాషా నిష్పత్తిన రాజకీయ, విద్య, ఉద్యోగ, ఆర్థిక, ఉపాధి, పారిశ్రామిక రంగాల్లో చట్టబద్ధతతో కూడిన రిజర్వేషన్లను కల్పించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

కని పెట్‌కోవాలి

ముద్దొచ్చే జంతువులతో ముంచుకొచ్చే ముప్పు



కావలా.. కాలక్షేపం.. హోదా.. ఆత్మీయత.. ఒంటరి తనం.. కారణం ఏదైనా నగర, పట్టణవాసుల జీవనంలో పెంపుడు జంతువులు భాగమైపోయాయి. వీటి సంరక్షణ విషయాల్లో అవగాహన లేక తెలియకుండానే ఇబ్బందులను కొని తెచ్చుకుంటున్నారు. జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సోకే అవకాశాలుంటాయి. ఒక్కోసారి ప్రాణం మీదకు వచ్చే ప్రమాదం కూడా ఉంది. అందుకే ఆదివారం జూనోసిస్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

- జంతువుల నుంచి మనుషులకు పొంచి ఉన్న రోగాలు
- పెంపుడు జంతువులకు టీకాలు వేయించడం మరువొద్దు
- పశు సంవర్ధకశాఖలో టీకాలు ఇవ్వడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు

నేడు ప్రపంచ జూనోసిస్ డే

సండే స్పెషల్

పాలమూరు: ప్రస్తుతం ప్రతి కుటుంబంలో పెంపుడు జంతువులు, పక్షులు పెంచుకోవడం పరిపాటిగా మారింది. కొందరైతే వాటిని సొంత పిల్లల్లా భావిస్తుంటారు. వాటికి ఏమైనా అయితే తల్లడిల్లిపోతారు. బయటికి వెళ్లిన వారు ఇంటికి తిరిగొచ్చాక పెంపుడు జంతువులు ఆప్యాయంగా దగ్గరకు వచ్చేసరికి అప్పటి వరకు ఉన్న ఒత్తిళ్లన్నింటినీ ఇట్టే మరిచిపోతారు. కొందరు వాటిని బయటికి తీసుకెళ్లి కాలక్షేపం చేస్తుంటారు. అయితే పెంపుడు జంతువులపై ఉండే అమితమైన ప్రేమ ప్రాణాంతకం కారాదని పశువైద్యులు చెబుతున్నారు. వాటిపై ఎంత ప్రేమ ఉన్నా.. వాటికి ఉండాల్సిన హద్దుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం చేయొద్దని సూచిస్తున్నారు.

పాజిటివ్ ఎనర్జీ..

ఇంట్లో మూగజీవులు ఉండటం వల్ల ఒక పాజిటివ్ ఎనర్జీ ఉంటుంది. జంతువులు సైతం మన నుంచి ప్రేమ, ఆప్యాయతను కోరుకుంటాయి. వాటి ప్రవర్తన, ఆరోగ్యాన్ని గమనిస్తూ ఎప్పటికప్పుడు టీకాలు, మందులు అందించడం వల్ల వాటి నుంచి వచ్చే వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు.

– అనూష కీర్తిరెడ్డి, మోనప్పగుట్ట, మహబూబ్‌నగర్



కుక్కలకు టీకా వేస్తున్న పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శివానందస్వామి

క్రమం తప్పకుండా ఏఆర్‌వీ ఇప్పించాలి..

పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) ఇప్పించాలి. ఏడాది ఒకసారి తప్పక తీసుకోవాలి ఈ వ్యాక్సిన్ ఇవ్వడం వల్ల 99 శాతం రేబిస్ మనుషులకు రాకుండా ఉంటుంది. పెంపుడు జంతువులను తరచూ చేతులతో తాకడం వల్ల పచ్చకామెర్లు, చర్మ సంబంధిత సమస్యలు, కుక్క వెంట్రుకలు ముక్కు ద్వారా ఊపిరితిత్తుల్లో ప్రవేశిస్తే నిమోనియా వస్తోంది. కుక్కతో కాసేపు కాలక్షేపం చేసిన తర్వాత ప్రతి ఒక్కరూ సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి. నోటి దగ్గర చేతులు పెట్ట డం చేయరాదు. సాధారణంగా ఇంట్లో ఉండే కు క్కలకు ప్లాస్టిక్ బొమ్మలు ఇవ్వడం వల్ల మనుషులను నోటితో పట్టుకోవడం తగ్గిస్తాయి. ఒకవేళ కుక్క గాటు పడితే మొదట సబ్బుతో శుభ్రం చేసి ఆ తర్వాత టీటీ ఇంజక్షన్ తీసుకొని ప్రభుత్వ ఆస్పత్రిలో ఏఆర్‌వీ ఐదు డోసులు క్రమం తప్ప కుండా తీసుకోవాలి.

– డాక్టర్ శివానంద స్వామి, అసిస్టెంట్ డైరెక్టర్ పశు సంవర్ధక శాఖ

జాగ్రత్తలు అవసరం

పిచ్చి కుక్క కాటు వ్యాధి ప్రాణాం**తకం అవుతుం**ది. కుక్క కారవడం **వల్ల మనిషి, ప**శువులలో 15 రోజుల **నుంచి ఆరు** నెలల వ్యవధిలో రోగం **బయటపడుతుం**ది. తల భాగంలో **కరిస్తే మెదడు**కు చేరడానికి 15 **రోజులు ప**డుతుంది. కాలు దగ్గర కరిస్తే ఆరు నెలల సమయంలో లక్షణాలు బయటపడుతాయి. పెంపుడు జంతువులు ఇంట్లో ఉన్నప్పుడు వాటితో పాటు పరిసరాలు శుభ్రంగా పెట్టుకోవాలి. ఇంట్లో మల మూత్ర విసర్జన చేయకుండా బయటకు తీసుకెళ్లి చేయించాలి. బెడ్‌పైకి వచ్చే పెట్స్‌ను మరింత శుభ్రంగా ఉంచాలి. పరిశుభ్రంగా ఉన్నప్పుడే మాత్రమే వాటిని హత్తుకోవడం, ముద్దులు పెట్టడం మంచిది.

- కరిచిన కుక్క ఎలాంటిదైనా వైద్య చికిత్స మాత్రం ఒక్కటే అన్న విషయం మరువద్దు. పిచ్చి కుక్క కాటు ప్రాణాంతకం నిర్లక్ష్యం చేస్తే కొద్ది రోజుల వ్యవధిలో మనిషికి కుక్క లక్షణాలు సంక్రమిస్తాయి. ఆ తర్వాత వైద్యులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి. కుక్క కరిచిన వెంటనే గాయమైన చోట సబ్బుతో శుభ్రంగా కడగాలి. కుక్క కరిచిన రోజు, 3వ రోజు, ఏడవ రోజు, ఆ తర్వాత 28వ రోజు ఒక్కో ఇంజక్షన్ చొప్పున నాలుగు దఫాలుగా చికిత్స తీసుకోవాలి.
- కుక్క కాటు తర్వాత ఒక్కో బాధితుడికి నాలుగు డోసులు ఇవ్వాల్సి ఉంటుంది. యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌తో పాటు కరిచిన దగ్గర గాయం శుభ్రం చేసి ఇమోరిన్‌గ్లోబిన్ అనే టీకా కూడా ఇస్తారు.
- పెంపుడు కుక్కలున్న వారు చర్మ సమస్యలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. పిల్లులు, పక్షులను పెంచేవారు వాటి వల్ల శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వస్తాయనే విషయాన్ని గ్రహించాలి. మనుషులకు ఉండే ఫ్యామిలీ డాక్టర్ తరహా..జంతువులు, పక్షులకు కూడా ఫ్యామిలీ వెటర్నరీ వైద్యులను ఏర్పాటు చేసుకోవాలి. ప్రస్తుతం ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెంపుడు కుక్కలు 6,153 ఉంటే పిల్లులు 1,012 ఉన్నాయి. అలాగే పావురాలు, పిచ్చుకలు, చిలుకలు, కుందేళ్లు పెంచుకునే వారి సంఖ్య సైతం క్రమంగా పెరుగుతోంది.

ఆప్యాయంగా ఉంటుంది..



నారాయణపేట రూరల్: కొవిడ్ సమయంలో పాఠశాలకు సెలవులు ఉండటంతో ఇంట్లో ఒంటరిగా ఉండలేక రూ.15 వేలు పెట్టి కుక్కను కొన్నాను. అప్పటి నుంచి ఇంట్లో సొంత బిడ్డలా ఉంటూ అన్నింట్లో హెల్ప్ చేస్తుంది. దీనికి లియో అని పేరు పెట్టి ప్రతి సంవత్సరం నవంబర్ 27న పుట్టినరోజు నిర్వహిస్తున్నాం. టీవీ చూస్తుంది. మా మాటలు అర్థం చేసుకుని చెప్పిన పని చేస్తుంది. రోజు వాకింగ్‌కు రావడం, వీధిలో దాదాపు 20 మంది ఫ్రెండ్స్ ఉన్నారు. ఏటా ఫ్రెండ్షిప్ బ్యాండ్, రాఖీ సైతం కడతాను. ఎంతో ఆప్యాయంగా ఉంటుంది. దాని ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటా.

– సునీత, నారాయణపేట

ఒత్తిడి పోతుంది..



మా ఇంట్లో ల్యాబ్ జాతికి చెందిన కుక్కను పెంచుతున్నాం. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయడం తోపాటు ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటాం. ఆరోగ్యకరమైన పద్ధతిలో జంతువులను పెంచుకుంటే మనలోని ఒత్తిడి దూరమవుతుంది. ప్రతినెలా కుక్క నిర్వహణ ఖర్చు రూ.15– 20 వేల వరకు వెచ్చిస్తాం.

– తేజశ్విని, ఏనుగొండ, మహబూబ్‌నగర్

ఎంతో అనుబంధం..



ల్యాబ్ జాతికి చెందిన కుక్క (టోని)ని రెండేళ్లుగా పెంచుకుంటున్నాం. ఎలాంటి జ్వరాలు రాకుండా మూడు నెలల వయసు దాటిన తర్వాత టీకాలు వేశాం. ఎప్పుడైనా చిన్నపాటి జ్వరం వచ్చినా వెంటనే వైద్యుల దగ్గరకు తీసుకువెళ్తాం. మా ఇంట్లో వాళ్లతో పాటు, చుట్టు పక్కల అందరితో ఇది కలిసిపోయింది. దాంతో మా అనుబంధం మరువలేనిది. అది లేకుంటే ఏదో వెలితిగా కనిపిస్తుంది.

– జయన్న, శాంతినగర్

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటా



గతేడాది బెంగళూరులో గోల్డెన్ రెటీవర్ బ్రీడ్‌కు చెందిన కుక్కను కొనుగోలు చేశాను. దీని ఆహారం, ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం. రోజు ఉదయాన్నే వాకింగ్‌కు తీసుకెళ్లడంతోపాటు ఆహారంగా పిలిగ్రిమ్స్, గుడ్లు, పాలు, పెరుగు వంటివి పెడతాం. ఎలాంటి ఇన్‌ఫెక్షన్ సోకకుండా ఇంజెక్షన్లు, టానిక్‌లు ఇప్పిస్తాం. ఈ కుక్క కోసం నెలకు రూ.5– 10 వేల వరకు వెచ్చిస్తాం. ఇంట్లో సొంత మనిషిలా మాతో కలిసిపోతుంది.

– పిల్లి శ్రీనివాసులు, లైన్‌మెన్, నాగర్‌కర్నూల్

ఆయిల్‌పాం సాగుకు ప్రాధాన్యం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

- జిల్లాలో సాగు లక్ష్యాన్ని సాధించాలి
- కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: ఆయిల్‌పాం సాగుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని.. జిల్లాకు 2025–26 ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన 3,500 ఎకరాల సాగు లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 54 ఎకరాల్లో ఆయిల్‌పాం మొక్కలు నాటినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులను గుర్తించడంతో పాటు వారికి ఆయిల్‌పాం తోటల సాగుతో వచ్చే లాభాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఒక్కో మండల వ్యవసాయాధికారికి 50 ఎకరాల టార్గెట్‌ను కలెక్టర్ నిర్దేశించారు. ఉద్యానశాఖ పథకం అనుసంధానంతో మొక్కల సరఫరా, మొదటి నాలుగేళ్లు అంతర పంటల సాగు, రసాయన ఎరువులకు సబ్సిడీ ఉంటుందని తెలిపారు. వారంలో మూడు రోజులు అధికారులు రైతువేదికల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటుచేసి.. ఆయిల్‌పాం సాగు దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఉద్యానశాఖ సంయుక్త సంచాలకురాలు రామలక్ష్మి, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ ప్రత్యేకాధికారి సత్యనారాయణ, జిల్లా ఉద్యాన, పట్టుపురుగుల పెంపకం అధికారి సాయిబాబా, డీఏఓ జాన్ సుధాకర్, డీడీ రాజరత్నం తదితరులు ఉన్నారు.

వసతుల కల్పనలో నిర్లక్ష్యం వద్దు

నారాయణపేట రూరల్: గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వసతి సౌకర్యాలను కల్పించడంలో నిర్లక్ష్యం వహించొద్దని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జిల్లా కేంద్రం సమీపంలోని దామరగిద్ద బాలుర గురుకుల విద్యాలయంలో ట్రెయినీ కలెక్టర్ ప్రణయ్ కుమార్‌తో కలిసి కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. వారి వెంట ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఉన్నారు.

మాదకద్రవ్యాల నివారణకు పకడ్బందీగా చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

నారాయణపేట: జిల్లాలో మాదకద్రవ్యాల నిషేధాన్ని పకడ్బందీగా అమలుచేయాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో మాదకద్రవ్యాల నిషేధం (యాంటీ నార్కొటిక్)పై ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గంజాయి సాగుపై వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మాదకద్రవ్యాలతో కలిగే నష్టాలపై ఉన్నత పాఠశాలల్లోనూ అవగాహన కల్పించాలన్నారు. డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ.. జిల్లాలోని జూనియర్, డిగ్రీ కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు డ్రగ్స్‌పై క్షేత్రస్థాయిలో నిఘా ఉంచడంతో డ్రగ్స్ కేసులు తగ్గాయని వివరించారు. కాగా, కేవలం పోలీసు శాఖ మాత్రమే కాకుండా ఎక్సైజ్, విద్యాశాఖ, ఆర్డీఓ, ఆర్టీసీ, అటవీశాఖ అధికారులు మాదకద్రవ్యాల నివారణకు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. అనంతరం డీఎల్ఎస్ఏ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుల ధ్రువపత్రాల జారీ విషయంలో తహసీల్దార్లు పాటించాల్సిన నిబంధనలను వివరించారు. సమావేశంలో ఇంటర్ విద్యాధికారి సుదర్శన్, డీపీఓ భిక్షపతి, ఆర్టీఓ మేఘాగాంధీ, డీఏఓ జాన్ సుధాకర్ ఉన్నారు.

వైభవంగా మొహర్రం వేడుకలు

- నేడు హసేన్ – హుస్సేన్ దశమి సవారీ
- దేవినగర్‌లో డోలారోహణానికి ఏర్పాట్లు



ఊట్కూర్‌లో హసేన్-హుసేన్ పీర్లను దర్శించుకుంటున్న భక్తులు

ఊట్కూర్: మతసామరస్యానికి ప్రతీకైన మొహర్రం వేడుకలు ఊట్కూర్‌లో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. మొహరం పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం అర్ధరాత్రి తర్వాత హసేన్, హుసేన్ నవమి సవారీ కనులపండువగా జరిగింది. వేడుకల్లో వేలాది పాల్గొని పెద్ద పీర్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాల నుంచి ట్రాక్టర్లు, ఆటో, ఎడ్లబండ్లలో వచ్చే భక్తులకు గ్రామ శివారులోని షాదీఖానా వద్ద గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం తెల్లవారుజామున హసేన్, హుసేన్ పెద్దపీర్ల సవారీ ప్రారంభం కానుంది. గ్రామంలో ఊరేగింపు అనంతరం ఉదయం 9 గంటలకు అషూర్‌ఖానాకు చేరుకుంటాయి. అక్కడ ప్రత్యేక ప్రార్థనల అనంతరం పీర్ల ఊరేగింపు చేపట్టనున్నారు. రాత్రి 10 గంటలకు గ్రామ సమీపంలోని పెద్దచెరువులో నిమజ్జనం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. మొహర్రం వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ లింగయ్య ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐ రాంలాల్, ఎస్ఐ రమేశ్ బందోబస్తును పర్యవేక్షించారు.

- మొహర్రం వేడుకల్లో భాగంగా డోలారోహణ కార్యక్రమానికి దేవినగర్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్రామంలోని ఆరెకటిక కులానికి చెందిన మగ శిశువును ఊయాలో వేయగా.. శోభాయాత్రలో భాగంగా హసేన్, హుసేన్ పీర్లు అక్కడికి వచ్చి ఊయాలను ఊపి నామకరణం చేయడం ఆనవాయితీగా వస్తోంది. డోలారోహణ కార్యక్రమాన్ని తిలకించేందుకు వేలాది భక్తులు హాజరవుతారు.

వికసిత భారత్ ప్రభుత్వాల లక్ష్యం


మాట్లాడుతున్న నీతి ఆయోగ్ ఉప కార్యదర్శి అరవింద్‌కుమార్.. పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

- నీతి ఆయోగ్ ఉప కార్యదర్శి అరవింద్‌కుమార్

వనపర్తి: వికసిత భారత్ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, దేశ వికాసం జిల్లాలు, రాష్ట్రాలపైనే ఆధారపడి ఉంటుందని నీతి ఆయోగ్ ఉప కార్యదర్శి అరవింద్ కుమార్ అన్నారు. రాష్ట్రాల్లో జల్‌జీవన్ మిషన్ అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవిక నివేదికను అందించేందుకు ఏర్పాటు చేసిన కేంద్ర 28వ బృందం శనివారం జిల్లాను సందర్శించింది. ఈ బృందానికి నీతి ఆయోగ్ డిప్యూటీ కార్యదర్శి అరవింద్ కుమార్ నాయకత్వం వహించగా సెంట్రల్ వాటర్ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ అరుణ్‌కుమార్, సెంట్రల్ గ్రౌండ్ వాటర్‌బోర్డ్ శాస్త్రవేత్త పి.యాదయ్య సహాయకులుగా ఉన్నారు. కేంద్ర బృందానికి కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభి స్వాగతం పలికారు. అనంతరం సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేసి జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు అందుతున్న తాగు నీరు, అవాంతరాలను అధిగమించేందుకు తీసుకున్న చర్యలను ప్రొజెక్టర్‌పై వివరించి నివేదిక రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కార్యదర్శి అరవింద్ కుమార్ మాట్లాడుతూ.. 2047లో అన్నిరంగాల్లో వికసిత దేశంగా చూసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ఏ విధంగా అమలు అవుతున్నాయి.. ప్రజల జీవన ప్రమాణాలు ఏ విధంగా అభివృద్ధి అవుతున్నాయి అనే విషయాలు తెలుసుకొని నివేదిక ఇచ్చేందుకు జిల్లాలో శని, ఆదివారం పర్యటిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అచ్యుతాపురం, ఖాసీంనగర్, కానాయపల్లిలో నీటిశుద్ధి కేంద్రం, రాజీవ్ భీమా లిఫ్ట్ ఇరిగేషన్–2 కాల్వను పరిశీలించి జిల్లా ప్రజలకు తాగునీరు ఎలా అందిస్తున్నారు.. నాణ్యత ప్రమాణాలు ఎలా ఉన్నాయి.. సమస్యలు తలెత్తితే ఏ విధంగా అధిగమిస్తున్నారనే విషయాలు తెలుసుకున్నట్లు వివరించారు.

జిల్లాలో ఇంటింటికి శుద్ధ జలాన్ని సరఫరా చేస్తున్నామని.. ఓవర్ హెడ్ ట్యాంకులను నెలకు మూడుసార్లు శుభ్రం చేయిస్తున్నామని కలెక్టర్ ఆదర్శ్ సురభి వివరించారు. అదేవిధంగా వ్యవసాయానికి అత్యధికంగా సాగు నీరు అందిస్తున్నామని.. వర్షపు నీరు, నది ప్రవాహంతో రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు నింపుతున్నట్లు తెలిపారు. భూగర్భ జలమట్టం పెంచేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయిస్తున్నట్లు చెప్పారు. వేసవిలో నీటిసమస్య తలెత్తితే పరిష్కరించేందుకు బోరుబావులు సిద్ధంగా ఉన్నాయన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ యాదయ్య, మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటరమణ, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి, డీఆర్డీఓ ఉమాదేవి ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్ల పరిశీలన..

మక్తల్: మండలంలోని సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్లను 28వ కేంద్ర బృందం శనివారం పరిశీలించింది. మండలంలోని చిన్నగోప్లాపూర్ సమీపంలో ఉన్న భీమా ఎత్తిపోతల పథకం, కృష్ణానది దగ్గర ఉన్న భీమా పంపుహౌజ్‌ను సందర్శించింది. అక్కడి పరిసరాలు, పిల్ల కాల్వలు, సాగు చేసిన భూములను పరిశీలించింది. ఖానాపూర్ దగ్గర పంప్‌హౌజ్ అనంతరం సంగంబండ రిజర్వాయర్‌ను సందర్శించి రైతులతో మాట్లాడారు. సాగు విస్తీర్ణం, నీటి సరఫరా, భూ నిర్వాసితులకు పరిహారం తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో కాల్వల ద్వారా సాగునీరు అందడం లేదని తమ దృష్టికి వచ్చిందని.. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్ల వద్ద పెండింగ్ పనుల వివరాలు తయారు చేసి తమకు పంపాలని అధికారులను ఆదేశించారు. వారి వెంట ఇరిగేషన్ ఎస్ఈ శ్రీధర్, డీఈలు సతీష్, సురేష్, డీఈఈ వెంకటరమణ, ఏఈఈ నాగశివ తదితరులు ఉన్నారు.


సంగంబండ రిజర్వాయర్ వద్ద కేంద్రం బృందం

జలాశయాలకు జలకళ


జూరాల ప్రాజెక్టు 14క్రస్టు గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

- జూరాల ప్రాజెక్టుకు 1.20లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 14 క్రస్టు గేట్లు ఎత్తి దిగువకు 1, 24,710 క్యూసెక్కులు
- జలవిద్యుత్ కేంద్రంలోని 11 యూనిట్లలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ధరూరు/ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ఎగువన కురిసిన వర్షాలకు ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం ప్రాజెక్టుకు లక్షా 15వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శనివారం సాయంత్రానికి లక్షా 20వేల క్యూసెక్కులకు పెరిగినట్లు పేర్కొన్నారు. దీంతో ప్రాజెక్టు 14 క్రస్టు గేట్లను ఎత్తి 92వేల 890 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నట్లు వివరించారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 28వేల 581 క్యూసెక్కులు, కోయిల్ సాగర్‌కు 315 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్–1కు 1,300 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 43 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 550 క్యూసెక్కులు, కుడి కాల్వకు 290 క్యూసెక్కులు, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 750 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్ -2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం లక్షా 24,710 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 7.444 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

పరవళ్లు తొక్కుతున్న తుంగభద్ర

అయిజ: తుంగభద్ర నది శనివారం నీటి ప్రవాహంతో తెలంగాణలో పరవళ్లు తొక్కుతోంది. ఆర్డీఎస్ హెడ్ వర్క్ వద్ద ఆనకట్టపై నాలుగు అడుగులు అలుగు పారుతోందని ఆర్డీఎస్ ఏఈ రాందాస్ పేర్కొన్నారు. మొత్తం 74,470 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉందని, 595 క్యూసెక్కులు ఆర్డీఎస్‌కు మళ్లించారని, సుంకేసులకు 6,845 క్యూసెక్కుల నీటి ప్రవాహం వెళ్తుందని ఏఈ పేర్కొన్నారు.

పరుగులు పెడుతున్న విద్యుదుత్పత్తి

దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్లద్వారా 195 మెగావాట్లు, 89.670 ఎంయూ, దిగువలో 6 యూనిట్లద్వారా 240 మెగావాట్లు, 108.224 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 197.894 ఎంయూ విజయవంతంగా విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు.

సుంకేసులకు భారీగా వరద

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి వరద భారీగా వచ్చి చేరుతుంది. కర్ణాటకలోని టీబీడ్యాంకు వచ్చిన వరద కారణంగా అక్కడ గేట్లు తెరవడంతో నీరు దిగువకు వస్తుంది. ఈ క్రమంలో శనివారం 72వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 19గేట్లను తెరిచి 74,423 క్యూసెక్కులను దిగువకు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.


నాగలదిన్నె బ్రిడ్జి వద్ద పరవళ్లు తొక్కుతున్న తుంగభద్ర నది


డ్యాం నుంచి దిగువకు వెళ్తున్న నీరు

క్లుప్తంగా

లారీ, ఆటో ఢీ : ఆటో డ్రైవర్ దుర్మరణం

మరికల్: లారీ, ఆటో ఢీకొని ఆటో డ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలోని తీలేరు స్టేజీ వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ రాము కథనం మేరకు.. మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన పార్థివ్ (36) శుక్రవారం రాత్రి మరికల్ నుంచి గ్రామానికి ఆటోలో బయలుదేరాడు. మార్గమధ్యంలో తీలేర్ స్టేజీ సమీపంలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. పార్థివ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి

మన్ననూర్: పాముకాటుతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన అమ్రాబాద్ మండలంలోని వెంకటేశ్వర్లబావి గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నారుమళ్ల రాములమ్మ (67)అచ్చంపేటలో నివాసం ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో గేటు వద్ద కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం వెళ్లింది. ఈ క్రమంలో గడ్డిలో ఉన్న పాము ఆమె కాలుపై కాటు వేసింది. వెంటనే కాలును తాడుతో బిగించి ఆటోలో చికిత్స నిమిత్తం మన్ననూర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో అంబేడ్కర్ కాలనీ వద్ద మృతి చెందినట్లు పేర్కొన్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ రైతు మృతి


రామాంజనేయులు (ఫైల్)

తిమ్మాజిపేట: మండల పరిధిలోని బుద్ధసముద్రం గ్రామంలో కావలి రామాంజనేయులు(40) అనే రైతు కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. రైతు రామాంజనేయులు కొన్నేళ్లుగా పంట దిగుబడి రాక, అప్పుల బాధ ఎక్కువవడంతో ఈ నెల 21న పొలంలో కలుపు మందు తాగి ఇంటికి చేరుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు జడ్చర్ల ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 4న రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

1.3 కేజీల గంజాయి స్వాధీనం

జడ్చర్ల: రాజీవ్‌నగర్‌లో 1.3 కేజీల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ విప్లవరెడ్డి తెలిపారు. కల్వకుర్తి ప్రధాన రోడ్డును అనుసరించి ఉన్న లక్ష్మి నివాసంలో గంజాయిని స్థానిక కళాశాలల విద్యార్థులు, యువతకు విక్రయిస్తున్నారన్నా సమాచారంతో ఎస్‌టీఎఫ్ హైదరాబాద్ టీం సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో కే.కౌశిక్, సీ.శ్రీకర్ నుంచి 1.3 కేజీల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

తొలిపూజకు వేళాయె



నేడు శయనైకాదశి పర్వదినం

- ఏకాదశి శ్రీమహావిష్ణువుకు ప్రీతికరం
- ప్రత్యేక పూజలకు వైష్ణవాలయాలు ముస్తాబు

స్టేషన్ మహబూబ్‌నగర్: తొలిపూజకు వేళైంది. శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైన తొలి ఏకాదశి వేడుకలకు వైష్ణవాలయాలు ముస్తాబయ్యాయి. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆషాఢశుద్ధ తొలిఏకాదశి హైందవులకు మహాపర్వదినం. తొలి ఏకాదశిని 'శయనైకాదశి, ప్రథమ ఏకాదశి' అని కూడా పిలుస్తారు. క్షీరాబ్దిలో శేషపాన్పుపై శ్రీమహావిష్ణువు శయనించడం (యోగానిద్ర)తో దీన్ని శయనైకాదశి అంటారు. ఏకాదశి శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైనది. మోక్షాన్ని ఇచ్చేమాసం ఆషాఢం. ఈరోజు నుంచి ఉత్తరం దిశగా ఉన్న సూర్యుడు దక్షిణ దిశకు వాలుతున్నట్లుగా కనిపిస్తాడు. నేటి (ఆదివారం) నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు 'చాతుర్మాస్య వ్రతాలు' ప్రారంభిస్తారు. ఏకాదశి 11 సంఖ్యకు సంకేతం. ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు, మనస్సు వెరసి పదకొండింటిపైన నియంత్రణ కలిగి వ్రతం ఆచరించాలన్నది ఈ పర్వదినం సందేశం. ఈరోజు నుంచే పండుగలు ప్రారంభమవుతాయి. రాబోయే శ్రావణమాసంలో మహిళలు ఆచరించే వ్రతాలు, నోములు బాద్రపదమాసంలో వినాయక నవరాత్రులు, దేవీ నవరాత్రులు, దసరా, దీపావళి ఇలా ఎన్నో పండుగలకు ఈ చాతుర్మస్యం ప్రత్యేకం.

అభిషేకాలకు ప్రత్యేకం

తొలి ఏకాదశికి ఆలయాల్లో ఎక్కాహం (ఉపవాసం జాగరణలు), అభిషేకాలు చేపడుతారు. ఎక్కాహం అంటే 24 గంటలపాటు ఆలయంలో భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉదయం ఎప్పుడైతే ప్రారంభిస్తారో మరునాడు అదే సమయం వరకు నిరంతరం భక్తి భజనలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తొలి ఏకాదశి పూజలకు పట్టణంలోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. స్థానిక పిల్లలమర్రి రోడ్డులోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం, సింహగిరిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏకాదశి పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా రేణుకా ఎల్లమ్మ గుడి, పాత శివాలయం, బండ్లగేరి ప్రాంతంలోని శ్రీరుక్మిణీ పాండురంగ స్వామి ఆలయం, టీచర్స్ కాలనీ రామాలయంతోపాటు పలు ఆలయాల్లో నేడు తొలి ఏకాదశిని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పండుగలకు ప్రారంభ సూచిక



వచ్చే పండుగలకు ప్రారంభసూచిక తొలిఏకాదశి. తొలి ఏకాదశికి ఎంతో విశిష్టత ఉంటుంది. తొలి ఏకాదశి రోజు నుంచే చాతుర్మస్యం దీక్ష ప్రారంభమవుతోంది. ఈ చాతుర్మస్యం నాలుగు నెలల్లో ఒక్కోనెల ఒక వ్రతాచరణ ఉంటుంది. చాతుర్మస్యం దేవతా పూజలకు నిలయమైనది. ఏకాదశి రోజు విష్ణు సహస్రనామ పారాయణం, భగవద్గీత పారాయణం అత్యంత పుణ్యప్రదమైనది.

– తోటపల్లి శ్రీకాంత్‌శర్మ, అధ్యక్షుడు, శ్రీవేంకటేశ్వర సేవా మండలి

తవ్వకాలు గుప్తనిధులకేనా?

గండీడ్: మండల పరిధిలోని బైస్‌పల్లి సమీపంలో అర్ధరాత్రి పొక్లెయిన్‌తో తవ్వకాలు చేపట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. గుప్త నిధుల కోసం నాలుగైదు ఏళ్ల కిందట ఇదే ప్రాంతంలో తవ్వకాలు జరపగా స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పట్లో పలువురిపై కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం తిరిగి తవ్వకాలు చేపట్టడం గుప్తనిధుల కోసమేనన్న అనుమానాలు బలపడుతున్నాయి. వివరాల్లోకి వెళ్లే.. బైస్‌పల్లి గ్రామ సమీపంలోని ఓ రైతు వ్యవసాయ పొలంలో శుక్రవారం అర్ధరాత్రి పొక్లెయిన్‌తో నాలుగైదు ప్రాంతాల్లో తవ్వకాలు చేపట్టారు. లైట్ల వెలుతురు, పదుల సంఖ్యలో జనం కనిపించడంతో గ్రామస్తులు అదేరాత్రి మహమ్మదాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకోగానే పలువురు పారిపోయినట్లు విశ్వసనీయ సమాచారం. పొక్లెయిన్‌తో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


గుప్త నిధుల కోసం తవ్వి పూడ్చిన గుంత

బండరాళ్లు తవ్వుతున్నారు..

ఈ విషయాన్ని ఎస్ఐ శేఖర్‌రెడ్డి వద్ద ప్రస్తావించగా.. రైతు తన పొలంలో బండరాళ్లను తొలగిస్తున్నారని చెప్పారు. ఉదయం వీలుగాక రాత్రిళ్లు పనులు చేస్తుండటంతో గ్రామస్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నట్లు చెప్పారని.. ఇందులో వాస్తవం లేదన్నారు. అక్కడ పూజలు చేసిన ఆనవాళ్లు ఏమీ లేవని చెప్పారు. అయినా తాము పూర్తిస్థాయి విచారణ చేపడుతున్నామని ఎస్ఐ వివరించారు.

లొద్ది మల్లయ్య జాతరకు ఆంక్షలతో కూడిన అనుమతి

మన్ననూర్: నల్లమల అటవీ సరిహద్దు ప్రాంతంలోని లొద్ది మల్లయ్య క్షేత్రంలో ప్రతిఏటా తొలి ఏకాదశి పర్వదినాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుపుకొంటారు. ఈ క్రమంలో ఆదివారం తొలి ఏకాదశిని పురస్కరించుకొని అటవీ శాఖ ఆంక్షలతో కూడిన అనుమతులు ఇచ్చినట్లు డీఎఫ్ఓ, ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ రోహిత్‌రెడ్డి తెలిపారు. ఎన్‌టీసీఏ ఆదేశాల మేరకు అభయారణ్యంలో జనసంచారం ఉండకూడదనే నిబంధనలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం లొద్ది మల్లయ్య, గుండం, ఫర్హాబాద్ తదితర అటవీ పరిసర ప్రాంతాల్లో పెద్దపులి తన రెండు పిల్లలతో కలిసి సంచరిస్తుందన్నారు. అలాగే కొంతకాలంగా అభయారణ్యంలో వన్యప్రాణుల సంతతితో పాటు సంచారం కూడా పెరిగిందన్నారు. ముఖ్యంగా జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో జంతువుల పునరుత్పత్తి సమయం అయినందున వాటి స్వేచ్ఛకు భంగం కలగకుండా ఉండేందుకు అటవీ ప్రాంతంలోకి ఎవరూ రావొద్దని అధికారుల ఆదేశాలు ఉన్నాయన్నారు. నిబంధనల మేరకు ఈ ప్రాంత ప్రజలు, భక్తులు కాకుండా ఇతర ప్రాంతాల వారు ఎవరైనా ప్రవేశిస్తే వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మన్ననూర్ మొదలుకొని దోమలపెంట చెక్‌పోస్టు వరకు అటవీ సమీపంలో ఎక్కడ కూడా వాహనాలు నిలపరాదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు.

మరోసారి 'దోస్త్' నోటిఫికేషన్

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి


మాట్లాడుతున్న ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

జడ్చర్ల టౌన్: డిగ్రీ కళాశాలల్లో ప్రవేశం కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు మరో అవకాశం కల్పిస్తూ దోస్త్ నోటిఫికేషన్ వేస్తామని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఉంద్యాల బాలకిష్టారెడ్డి స్పష్టం చేశారు. శనివారం జడ్చర్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో మొదటి ఏడాదిలో ప్రవేశం పొందిన వారికి నిర్వహించిన విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇంజినీరింగ్ కౌన్సిలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత మరోసారి డిగ్రీలో ప్రవేశానికి అవకాశం కల్పిస్తామన్నారు. డిగ్రీ చదువుతో ఉన్నత ఉద్యోగాలు అనేకం ఉన్నాయని, కాకపోతే విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. దేశంలో అనేక రంగాల్లో ఉద్యోగావకాశాలు కోకొల్లలుగా ఉన్నాయని, వికసిత భారత్‌లో భాగంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ ఉపాధి కల్పనలో దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ప్రత్యేకంగా సముద్ర సంబంధిత విభాగాల్లో రాబోయే కాలంలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని, యువత వాటిని ఉపయోగించుకోవాలని కోరారు. త్వరలో దేశం ప్రపంచంలోనే 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందన్నారు.

గార్డెన్ అభివృద్ధికి రూ.25 వేల విరాళం

కళాశాల సందర్శనలో భాగంగా ఆయన బొటానికల్ గార్డెన్‌లో మొక్కనాటి నీళ్లు పోసి రూ.25 వేల విరాళం గార్డెన్ సమన్వయకర్త సదాశివయ్యకు అందజేశారు. జిల్లాకు చెందిన వ్యక్తిగా గార్డెన్ అభివృద్ధిలో తనవంతు పాలుపంచుకుంటున్నట్లు వెల్లడించారు. జీవ వైవిధ్య పరిరక్షణకు కృషిచేయాలని దాతలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మరెక్కడ లేని విధంగా ఉన్న గార్డెన్ మరింత కష్టపడితే గిన్నీస్ బుక్‌లోకి ప్రవేశించే అవకాశం ఉందన్నారు. కళాశాలకు వచ్చిన ఆయనకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నర్మద స్వాగతం పలికారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, రాఘవేందర్‌రెడ్డి, సదాశివయ్య, సులేమాన్, జబీన్, నర్సింహులు, నాగలక్ష్మి, వేణు, రాజేశ్వరి, పుష్పలత, నర్సింహారావు, వెంకటయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యపై ఆర్ఐ విచారణ

మద్దూరు: మండలంలోని దమ్‌గాన్‌పూర్ గ్రామానికి చెందిన విద్యార్థి మాలే మనీష(14) ఆత్మహత్య ఘటనపై మద్దూరు ఆర్ఐ అమరేందర్ శనివారం గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. విద్యార్థిని తల్లిదండ్రులు నర్సప్ప, లక్ష్మి, కుటుంబ సభ్యుల స్టేట్‌మెంట్ తీసుకున్నారు. మనీష గ్రామంలోని పాఠశాలలో 8వ తరగతి పూర్తి చేసుకొని 9వ తరగతి ప్రవేశం కోసం గురుకుల ప్రవేశ పరీక్ష రాసిందని అర్హత సాధించలేకపోవడంతో సీటు రాదని మనస్తాపానికి గురైందన్నారు. గురుకుల పాఠశాలలో సీటు రాకపోవడం, మద్దూరు పాఠశాల నుంచి టీసీ తీసుకోవడంతో మనస్తాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందని వివరించారని ఆర్ఐ తెలిపారు.

మనస్తాపంతో యువకుడి బలవన్మరణం

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సింగోటం గ్రామంలో మనస్తాపంతో ఓంకర్(30) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఓంకర్ తన భార్య సరితతో శుక్రవారం ఘర్షణ పడ్డాడు. ఇట్టి విషయాన్ని అదే రోజు భార్య తన తల్లిదండ్రులకు తెలుపడంతో వారు ఓంకార్‌తో ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన ఓంకార్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొల్లాపూర్ ఆస్పకి తీసుకెళ్లగా, మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి తల్లి జానకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొల్లాపూర్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మన్ననూర్: మన్ననూర్ చెరువు కొమ్ము లింగమయ్య చెక్‌పోస్టుకు 4 కిలోమీటర్ల దూరంలో శ్రీశైలం– హైదరాబాద్ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలిలా.. హైదరాబాద్‌కు చెందిన రాము(28) తన స్నేహితుడితో కలిసి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న కారును చూసి ఆందోళన చెంది సడెన్ బ్రేక్ వేశారు. దీంతో వెనకాల కూర్చున్న రాము ఎగిరి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిసింది.

మొక్కజొన్న క్వింటా రూ.1,951

జడ్చర్ల/గద్వాల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.1,951 ధర లభించింది. అలాగే హంస రూ.1631, ఆర్ఎన్ఆర్ ధాన్యం గరిష్టంగా రూ.2150, కనిష్టంగా రూ.1939 పలికింది. గద్వాల మార్కెట్‌లో వేరశనగకు గరిష్టంగా రూ. 5,490, కనిష్టంగా రూ. 3,019, సరాసరి రూ. 5,190 లభించింది. మార్కెట్‌కు 720 క్వింటాళ్ల వేరుశనగ విక్రయానికి వచ్చింది.

AZAD D.Ed. COLLEGE (T/M)
(Approved by NCTE & Govt. of Telangana) Pullur, Jogulamba Gadwal Dist, Telangana
Admission Notification for 'B' catagory seats (2025-2027)
★ TGDEECET-2025 qualified in TELUGU MEDIUM candidates
★ BC,OC&PHC, candidates qualified with rank and SC&ST Candidate Rank only.
☛ The candidates should secured 50%marks in examination (intermediate/equivalent)
☛ Minimum percentage for SC,ST,PHC candidates should be 45% (intermediate/equivalent) Apply before:10.07.2025
Contact Correspondent/ Principal : 9440551099 / 8074677125

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
HOUSE FOR SALE
■ నాగర్‌కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడలో మూడు పోర్షన్లు కలిగిన 220 గజాల ఇల్లు అమ్మబడును. సంప్రదించండి. సెల్ : 9059211546

DISTANCE EDUCATION
■ మావద్ద ఓపెన్ 10th, ఇంటర్, డిగ్రీ, పీజీ, MBA, MCA, B.Tech, LLB, ITI, డిప్లొమా, ఫార్మసీ, B.Sc. (Agree), HPT, B.Ed, B.PEd, అడ్మిషన్లకై సం.ప్ర. 99481 31154

SERVICES
MARRIAGE SERVICES
■ కమ్మకాపు వెడ్స్ హిందూ, ముస్లిం, క్రిస్టియన్ (మాల మాదిగ) తగిన వివాహ సంబంధాలపై సంప్రదించండి. Sunny: 97058 20660.

WANTED
■ Hyd-రియల్ ఎస్టేట్ Co. కై మార్కెటింగ్ Exe కావలెను. కోకాపేట్, శంకర్‌పల్లిలో విల్లాస్/ ప్లాట్స్ సేల్స్‌కై జీ+టీఏ+2వీలర్+రూం+ఫో. ఫ్రీ. Age: 34, నె.లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ : 18K. Ph: 9848571888, 9640400073

■ రామకృష్ణ ఓల్డేజ్‌హోం నాగోల్ Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషెంట్ల సేవ వంట/ఇంటిపని బేబీకేర్ కై M/F వర్కర్స్ కా॥ ఫ్రీ+వసతి + జీతం: 16–18 వేలు ఏజెంట్లకు 5వేలు కమీషన్ ఫోన్ : 9281485319, 9010680011

భవిత విద్యార్థుల కోసం

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారులు చెప్పే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధమూ లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు – సాక్షి మేనేజర్